

# కోటి సంతోషం డివిడెండ్

శ్రీమతి టి. వరలక్ష్మి

"ఏమిటలా పరధ్యానంగా ఉన్నారు ?" భర్త చేతికి పాల గ్లాసు అందిస్తూ అడిగింది సుజాత.

"ఆఁ!...ఏం లేదు. మామూలుగానే ఉన్నానే," సర్దుబోయాడు కళ్యాణ్.

"అలా కప్పి పుచ్చకండి, దేనికోసమో ఆలోచిస్తున్నట్టున్నారు."

పాలు తాగుతూ సమాధానం చెప్ప లేదు కళ్యాణ్. పాలుతాగేసి గ్లాసు భార్య చేతికి అందించాడు.

"నేనడిగిన దానికి సమాధానం చెప్పారు కాదు!". గ్లాసు పక్కనున్న టీపాయ్ మీద పెడుతూ అంది సుజాత.

"అబ్బే! మామూలుగానే ఉన్నాను" మళ్ళీ అన్నాడు కళ్యాణ్.

"అయితే రోజూలా కబుర్లు ఆఫీసు విశేషాలు చెప్పడం లేదేం ?"

"ఓ అవా, నీకు యివాళ కబుర్లు కాదు...కథ చెప్తాను వింటావా ?" పైన తిరుగుతున్న సీలింగు ఫేనువంక తదేకంగా చూస్తూ అన్నాడు కళ్యాణ్. అతడొక ప్రభుత్వ యాజమాన్య సంస్థకి మానేజింగ్ డైరెక్టరు.

"అమ్మబాబోయ్ కథే! కథలు చెప్పడం ఎప్పుడు నేర్చుకున్నారు ?" కొంచెం ఆశ్చర్య పోతూ అడిగింది సుజాత.

"కథలు చెప్పడం నేర్చుకోలేదుగానీ ఓ నిజమైన కథ...వింటావా?..."

"మీరేది చెప్పినా వింటానండీ, మీరేం చెప్పినా వినడానికి హాయిగా ఉంటుంది. చెప్పండి" అంటూ లైటు తీసేసి వచ్చి మంచం మీద భర్త పక్కనే పడుకొని,

"ఊఁ, మొదలెట్టండి" అంది సుజాత డైరక్టరు.

ఒక వూళ్ళో రఘు అనే అబ్బాయి ఉన్నాడు. చాలా మంచివాడు. యమ్మే ఫస్టు క్లాసులో పాసయ్యాడు. వాళ్ళది మధ్య తరగతి కుటుంబం. ఆ యింటికి రఘే పెద్దకొడుకు. యమ్మే పాసయి ఐ.ఏ.ఎస్. చెయ్యాలని అతని ఆశ. అలాగే ఐ. ఏ. ఎస్. రిటెన్ టెస్టులో పాసయ్యాడు. యిక యింటర్వ్యూ ఉంది. దానికోసం ఎదురు చూస్తున్నాడు. కొన్నాళ్ళు గడిచిపోయాయి. ఈమధ్యలో మరో యింటర్వ్యూకి హైదరాబాద్ వెళ్ళి ఆ తరువాత బంధువుల యిళ్ళలో ఓ పది రోజులపాటు గడిపి తిరిగి యింటికి వచ్చేసరికి ఐ.ఏ.ఎస్. ఇంటర్వ్యూకి ఢిల్లీ రమ్మనమని కాయితం వచ్చింది. అది చూసి చాలా కంగారు పడిపోయాడు రఘు. యింటర్వ్యూకి ఎక్కువ వ్యవధి లేదు. మధ్యలో మూడు రోజులే టైముంది—. రఘు ఉన్న ఊరినుండి ఢిల్లీకి సరిగ్గా మూడున్నర రోజులు ప్రయాణం. ఏం చెయ్యాలో అతడికి బోధపడలేదు. ఇన్నాళ్ళ తనకన్న కలలు వ్యర్థమయిపోతాయేమోనన్న బాధ ఒకపక్క, అనవసరంగా ఊళ్ళు తిరిగి కాలయాపనచేసి వచ్చిన అవకాశాన్ని చేజేతులా నాశనం చేసుకున్నానే అన్న బాధ మరొక పక్క. యింక ఆ రాత్రికి ఆ వూరి నుండి బయటికి వెళ్ళడానికి బస్సులు లేవు. ఆ వూళ్ళో రైలు స్టేషను లేదు. తెల్లవారి ఫస్టుబస్సుకి విజయనగరం వెళ్ళి హౌరా మద్రాసు జనతాని కేచ్ చేయగలిగితే ఢిల్లీ

యింటర్వ్యూకి రోజుకు ముందురోజు రాత్రి చేరుకోవచ్చు. అది తప్పితే మళ్ళీ అమర్నాటి రాత్రే ఢిల్లీ చేరుకోవడం.

ఆ రాత్రంతా రఘుకి ఆలోచనలతో నిద్రపట్టలేదు. తను ఢిల్లీ చేరగలడా? యింటర్వ్యూకి అందుకోగలడా? ముందు యింటర్వ్యూకి అందుకోగలిగితేగదా ఆపైన ఉద్యోగం సంగతి— అసలు యింటర్వ్యూకే వెళ్ళలేకపోతే ఉద్యోగం ఎలా వస్తుంది? అతడి మనసంతా అస్తవ్యస్తంగా ఉంది.

భగవంతుడిమీద భారంవేసి మర్నాడు పొద్దున్నే అయిదున్నర గంటలకి బస్సు స్టాండుకి వచ్చాడు రఘు. యిప్పుడు విజయ నగరానికి వెళ్ళే బస్సు ప్రైవేటుది. వాటికి ఒక టైమంటూ ఉండదు. ఎక్కడ పడితే అక్కడే ఆపేస్తారు. సామాన్లు లగేజీలు ఎక్కించడం దించడంతోనే సరిపోతుంది. రఘుకి ప్రైవేటుబస్సుల ప్రయాణం బాగా అనుభవమే. అయినా ఏం చేస్తాడు. యింత కన్నా మరో గత్యంతరం లేదు. ఈ బస్సు తప్పిపోతే మరో గంటన్నర వరకూ విజయ నగరానికి బస్సు లేదు. అందులో వెళ్తే టైముకి అందుకోవడం గ్యారంటీలేదు. గంటన్నర తమువాత మరి చెప్పనక్కర్లేదు.

...లో చూస్తున్న రఘుకి దూరాన బస్సు హెడ్‌లైట్లు కనపించాయి. తాపీగా షెడ్డు లోంచి వచ్చి స్టాండులో ఆగింది బస్సు. బస్సు ఆపుతూనే కిందకి దిగి టీ కొట్టు వైపు నడిచాడు బస్సు డ్రైవరు. అప్పుడు టైము అయిదు గంటల యాభైనిముషాల యింది. మెల్లగా బస్సు డ్రైవరు దగ్గరకి వెళ్ళాడు రఘు. అప్పటికి టీకి ఆర్డరిచ్చి జేబులోంచి బీడీతీసి వెలిగించాడు డ్రైవరు.

"ఈ బస్సు డ్రైవరు మీరేనా?" తాపీగా అడిగాడు రఘు.

చిత్తరపోయాడు డ్రైవరు. తనయిరవై రెండేళ్ళ సర్వీసులో ఏ పాసంజరూ యిలా అడగలేదు.

"మీ పేరు...!" అతడు ఆశ్చర్యం లోంచి తేరుకోక ముందే మళ్ళీ అడిగాడు రఘు.

ఈసారి డ్రైవరు యింకా ఆశ్చర్య పోయాడు. ఆ కుర్రాడు యిన్ని వివరాలు ఎందుకడుగుతున్నాడో అతడికి బోధపడ లేదు.

"అప్పలరాజు..., ఎందుకు ?" టేబిలు మీద టీ గ్లాసు అందుకొని కొంచెంతిక్కగా అన్నాడు.

"ఆఁ...ఏంలేదు !, నేను ఢిల్లీ వెళ్ళాలి" ...నీళ్ళు నములుతూ అన్న రఘు మాటలు పూర్తి కాకముందే ఫెళ్ళుమని నవ్వాడు అప్పలరాజు. గొంతులో టీ ఉండడంవల్ల పలకమారిపోయాడు. పలకమారుతూనే,

"మా బస్సు ఢిల్లీ ఎళ్ళదు, విజయ నగరం ఎల్తాది" అన్నాడు.

చిన్నబోయాడు రఘు. అతడి ముఖం లోని మార్పుని గమనించి కొంచెం బాధ పడ్డాడు అప్పలరాజు.

"బస్సు యిక్కడ ఎన్నిగంటలకుబయులు దేరుతుంది ?" మెల్లగా అడిగాడు రఘు.

"ఆరుకి... గానీ ఆరుంపావయిపోద్ది"

"విజయనగరం ఎన్నింటికి చేరుతుంది ?"

"మా రైట్ టయిము ఎనిమిదీనలభై, తోవలోన లగేజీల్ని బట్టి టిక్కట్ల బట్టి లేటవుద్ది."

"మద్రాసు వెళ్ళే జనతా ఎన్నింటికి వస్తుంది ?"

"ఎనిమిదింపావు."

"బండి లేటు ఉంటుందా ?"

"ఉండదు. ఎప్పుడూ మే వెళ్ళేసరికి ఎళిపోద్ది."

"అయితే మీ బస్సు ఆ బండికి అం దించలేదన్నమాట" హతాశుడైపోయి తనలో తను అనుకుంటున్నట్టుగా పైకి అనేసి బెంచీమీద కూలబడి పోయాడు రఘు. కళ్ళల్లో నీరు తిరగడంలేదు గాని దాదాపు ఏడుస్తున్నట్టుగా ఉంది అతడి ముఖం.

టేబిలు మీద ఖాళీ గ్లాసుపెట్టి రఘు వైపు చూశాడు అప్పలరాజు. రఘు ముఖం చూడగానే జాలి కలిగింది. అతడు ఎందు కంతబాధ పడిపోతున్నాడో అర్థం కాలేదు అప్పలరాజుకి.

"యింతకీ ఎవ్వూ రెల్లాలన్నావ్ ?..." సౌమ్యంగా అడిగాడు అప్పలరాజు.

"ఢిల్లీ" పేలవంగా అన్నాడు రఘు.


"మరి, ఆ జనతా మద్రాసు ఎల్తాది గదా !"

"ఔను !, మద్రాసే. వైజాగ్‌లో దానికి ఒక ఢిల్లీ భోగీ తగిలిస్తారు. దాన్ని బెజవాడలో మద్రాసు నుండి ఢిల్లీ పోయే జి. టి. ఎక్స్‌ప్రెస్‌కి తగిలిస్తారు."

"ఆఁ, అలాగా" జేబులోంచి మరో బీడి తీసి వెలిగించాడు అప్పలరాజు.

"అంత యిదైపోతున్నావు ! ఢిల్లీలో ఏటిపని ?" మళ్ళీ అన్నాడు అప్పలరాజు.

"ఉద్యోగం కోసం"



"ఓరి !, యిక్కడెక్కడా ఉజ్జోగందొరకి నట్టు వందలు తగలెట్టి ఢిల్లీ ఎల్తన్నా వేటి ?"

"అదివాలా పెద్ద ఉద్యోగం, ఢిల్లీలో తప్ప మరెక్కడా పరీక్ష జరగదు"

"ఏటా ఉద్యోగం ?...ఏటా పరీచ్చ?"

"ఐ. ఏ. యస్"

"అంటే ఏటి ?"

"అది పాసయితే కలక్టరు ఉద్యోగం వస్తుంది"

"ఓర్నాయనో !, కలక్టరే !" గబుక్కున బెంచీ మీద నుంచి లేచి అన్నాడు అప్పలరాజు.

"యింతకీ నువ్వెవలబ్బాయివి ?"

మాది ఈ వూరు కాదు మా నాన్న గారు యిక్కడ హైస్కూల్లో హెడ్మాష్టరుగా పని చేస్తున్నారు.

"హైస్కూలు హెడ్ మేష్టరా ! మంచోడుకాదట పిల్లల్ని కొడతాడట, మా వోడ్ని కూడా ఒకటి రెండు సార్లు కొట్టాడట" బస్సు వైపు అడుగులు వేస్తూ అన్నాడు అప్పలరాజు. రఘు అక్కడే ఉండిపోయాడు.

అప్పలరాజు తలుపుతీసి డ్రైవరు సీట్లో కూర్చొని బుయ్యిమని హారన్ మోగించాడు. ఉలికి పడి అటు చూశాడు రఘు. రఘు వైపే చూస్తున్న అప్పలరాజు అతడిని రమ్మని చేత్తో సైగ చేశాడు. ఎందుకో అర్థం గాక డ్రైవరువ తలుపు దగ్గర నిలబడ్డాడు రఘు.

"సూసావేటి బండెక్కు"

"రైలుకి అందించదు గదా. ఆ రైలుకి

## చెయ్యని నేరానికి

కాలం
ఇంద్రజాలం
కలిపింది
నడిపింది
గడిపింది
చెడిపింది

గానం
రగిలింది
మౌనం
మిగిలింది
'శిక్షాస్మృతి' లో
లేని శిక్ష
స్మృతి శిక్ష

— కే వి స్వీ

## కోటిగుణితం దివిదాయెత్తి

అందుకోకపోతే నేను టైముకి ఢిల్లీ చేరుకోలేను" నిరాశగా అన్నాడు రఘు!

"అవును! మా టయిం పెకారం అయితే బండి అందదు. గనీ నిన్ను బండికి అందిస్తాను" ధృఢ స్వరంతో అని మరోసారి హారన్ మోగించాడు అప్పలరాజు.

నమ్మలేనట్టుగా చూశాడు రఘు. అప్పలరాజు కళ్లల్లో పట్టుదల కొట్టొచ్చి నట్టు కనిపించింది. అయినా రఘుకి నమ్మకం కలగలేదు. ప్రతీ మైలుకీ రెండు మైళ్ళకీ ఎవరో ఒకరు బస్సుని ఆపుతూనే ఉంటారు. ఎక్కుతూ దిగుతూంటారు. నాయుడుగారు వస్తున్నారు. ప్రెసిడెంగా గారు వస్తున్నారు. ఒక్క నిముషం నిల బెట్టండి అని అయిదేసి పదేసి నిముషాలు ఆగిన సందర్భాలెన్నో రఘుకి అనుభవం. అయినా ప్రయత్నిస్తే తప్పేముంది అను కొని తాపీగా బస్సు ఎక్కి డ్రైవరుకి ఎడం పక్కనున్న సింగిల్ సీటు మీద కూర్చున్నాడు రఘు.

అప్పలరాజు మోగించిన హారన్‌కి పక్కనున్న కిళ్ళీకొట్టు దగ్గర బాతాఖానీ కొడుతున్న కండక్టరు, క్లీనరూ చెక్కరు వచ్చారు.

"ఏటి గురూ! అప్పుడే ఎలిపోతా వేటి?" అన్నాడు క్లీనరు

"బండెక్కండి" ముభావంగా అన్నాడు అప్పలరాజు.

"టయిమెంతో సూశావా?" అడిగాడు కండక్టరు.

"టయిమూ లేదు గియిమూ లేదు. ముందు బండెక్కండి" కసురుకున్నాడు అప్పలరాజు.

"ఏటలాగ సూస్తారు! ఆరవలేదేటి?" మళ్ళీ ఖంగుమంది అప్పలరాజు కంఠం.

కండక్టరూ, క్లీనరు నోళ్ళు మూత బడ్డాయి. అంత కోపంగా అప్పలరాజుని వాళ్ళెప్పుడూ చూడలేదు.


మెల్లగా చెక్కరు ముందు కొచ్చాడు.

"ఏటి గురూ! ఈవేల యవారం కొత్తగుంది" అన్నాడు కండక్టరు.

"కొత్తేటీలేదు. టయిముయింది ఎలిపోదాం?"

"రోజా రీ టయింకే ఎల్తన్నామేటి?"

(36వ పేజీ చూడండి)



## వధువు కావలెను

అబుదాబిలో నెలకు సుమారు 2500 రూపాయలు జీతం పై పని చేస్తూ, కొద్ది పాటి చదువు గలిగి, 25 సం॥ల వయసుగల క్రిస్టియన్ యువకునకు వధువు కావలెను. కట్న కానుకలు అవసరం లేదు. కొద్దిపాటి చదువు వుండి, మంచి సంబంధమైతే చాలును. కులము ఎట్టిదైనను ఏకులమైనను సమ్మతమే. వరుని స్వగ్రామము కాకినాడ. ఆగస్టులో సెలవు పై ఇండియాకు వస్తున్నారు. ఈలోగా ఆసక్తి గలవారు ఫోటో వివరాలు ఈ క్రింది అడ్రసుకు పంపవచ్చును

**M. S KUMAR,**
**P.O Box No. 498,** ABU-DHABI (U.A.E)




## ఎలక్ట్రానిక్ వాచీలు

ఖచ్చితమైన సమయం
తేదీ, నెల, అలారం మోడల్స్
రు **410** నుండి
సేల్సు & సర్వీసు
**సోనో విజన్**
ఏలూరు రోడ్, విజయవాడ-2.
ఇప్పటి ముందు ధరలకే కొద్ది స్టాకు మాత్రమే కలదు

SUVARNA

## ఢిల్లీ సందర్శించే యాత్రిక బృందాలకు శుభవార్త!

హోటళ్ళు, ధర్మశాలల్లో అతి తక్కువ ఖర్చుతో వసతి కల్పించేందుకూ, టూరిస్టు బస్సులను ఏర్పాటు చేసేందుకూ అత్యుత్తమమైన మా సంస్థను ఉపయోగించుకోండి మేము స్వంత లక్సరీ బస్సులలో టూరిస్టు సర్వీసులు నడుపుతున్నాం

1. శ్రీనగర్ — గుల్మార్గ్ — పహల్గాం — అమర్‌నాథ్ (సెలవుల యాత్రలు) టిక్కెట్టు ఒక్కొక్కరికి రు 300/— దయచేసి సంప్రదించండి
2. హరిద్వార్ — కేదార్‌నాథ్ (మే నెల నుండి అక్టోబరు వరకు) టిక్కెట్టు రు 300/- నుండి రు. 375/— వరకు వసతితో సహా

ఇవిగాక ఢిల్లీ నగరం సందర్శనకు, ఆగ్రా — మధుర — బృందావన్‌కూ రోజూ బస్సు సర్వీసు వుంది
ముస్సోరి, హరిద్వార్ — రిషీకేష్‌లకు కూడా బస్సు సర్వీసు వుంది

పూర్తి వివరాలకు సంప్రదించండి

While in Delhi, stay at SOUTHERN GUEST HOUSE,
(our Associate Co winners of Gold-Medal for best tourist services.
("సదరన్ ట్రావెల్స్, ఢిల్లీలోని ఆంధ్రుల ప్రైవేటు సంస్థ)

**SOUTHERN TRAVELS (Regd.),**
Gurudwara Road, Near Vijaya Bank,
Karol Bagh **NEW DELHI-110 005.**
Phones · **568728, 564085.**

SUVARNA


## కోటిగుణితం దివిదాయెత్తి

(18 వ పేజీ తరువాయి)

"ఒక్కనాటి టయింకెల్తే తప్పేటి?" ఎదురు ప్రశ్న వేశాడు అప్పలరాజు

"సొంత బండిలాగ మాట్లాడతన్నా వేటి?"

"నా సొంత బండేటి?" రెచ్చిపోయాడు అప్పలరాజు.

యిది యిలా చినికి చినికి గాలివాన అవుతుందేమోనని 'గుండెలుగ్గబట్టుకొని' చూస్తున్నాడు రఘు

అప్పలరాజు రెచ్చిపోవడంతో కొంచెం నెరక్కి తగ్గాడు చెక్కరు

"బండి నీదీకాదు. నాదికాదు బండి తీసే ముందు బండిలోన టిక్కెట్లు సూడా లంటావా? నాలుగు టిక్కెట్లున్నాయి ఆ నాలుగిటితో టీ నీళ్ళ పోతె అయిలు సామ్మెనా రావాలంటావా?"

"ఆ! ఒక్క నాటికి కొంప మునిగి పోదులె"

"అప్పలరాజా! నియవారం నాకేం నచ్చలేదు ఈ వేలహొత్తుగా ఉన్నావు ఓనరుకి ఈ సంగతి సెప్పవలసొస్తది." అలా అప్పలరాజు ముందు మాట్లాడే ధైర్యం చెక్కరుకి లేక పోయినా తను ఓనరు తాలూకా మనిషినన్న ధీమాతో అన్నాడు చెక్కరు

ఎవరేం చెప్పినా వినేట్టు లేడు అప్పలరాజు యింజను ఆన్ చేసి విసురుగా గేరు మార్చాడు బస్సు కదిలింది అంత వరకూ ఏమవుతుందోనని ఆతృతగా ఉన్న రఘు మనసు తేలిక పడ్డది చేసేది లేక మిగతా ముగ్గురు బస్సు ఎక్కారు అప్పలరాజు ప్రవర్తన వాళ్ళకేం అర్థం కాలేదు.

బస్సు వేగాన్నందుకుంది ఊరు చివర మలుపు తిరుగుతుండగా క్లీనరు బస్సు ఆపమని ఊళ వేశాడు అయినా బస్సు ఆపలేదు అప్పలరాజు దాంతో వాళ్ళ ముగ్గురికీ ఉన్నమతులు పోయినాయి. ఊరి పొలిమేరల్లో ఉన్న దుర్గాలమ్మ గుడి దగ్గిర బస్సులు ఆగుతాయి. పూజారి వచ్చి అందరికీ పువ్వులు కుంకుమ యిచ్చి దక్షిణ వసూలు చేసుకుంటాడు. ఇది అన్ని బస్సులూ పాటిస్తున్న ఆచారం. దుర్గాలమ్మ అంటే అక్కడి వాళందరికి మంచి నమ్మకముంది ముఖ్యంగా ఆపూరి నుండి

బయలుదేరిన ప్రతీ బస్సు ఖచ్చితంగా అక్కడ ఆగుతుంది పూజారి వచ్చి బోనెట్ మీద కుంకుమ బొట్టు పెట్టి డ్రైవరుకి కుంకుమ యిస్తాడు అవూరి డ్రైవర్లందరికీ ఉన్న నమ్మకం అది అప్పలరాజు తన యిరవై రెండేళ్ల సర్వీసులో ఒక సారైనా తప్పి పోకుండా యింత వరకూ ఆ గుడి దగ్గర బస్సు ఆపుతూ ఆదేవిని మన సారా ధ్యానించు కొని బస్సు పోనిచే వాడు అటు వంటిది ఈ రోజు అక్కడ బస్సు ఆప కుండా లాగించాడంటే వాళ్ల ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది. ముందుకి ఏం జరగబోతున్నదోనని భయపడి పోయారు.

విపరీతమైన అప్పలరాజు ప్రవర్తన వాళ్ల ముగ్గురికీ అంతుపట్ట లేదు. బస్సుని కూడా రోజు కన్నా మంచి స్పీడులో తోలు తున్నాడు. బహుశా తన యిరవై రెండేళ్ల సర్వీసులో యింత జోరుగా బస్సు తోలడం యిదే మొదటి సారేమో ఎందుకు? ఏం ముంచుకు పోతున్నదని ఈకంగారో వాళ్లకి అర్థం కాలేదు.

తరువాత ఏంజరిగినా, ముందు తన ధ్యేయం ఒక్కటే! ఎలాగైనా రఘుని రైలుకి అందించాలి. అదే ధృడనిశ్చయంతో బస్సు తోలుతున్నాడు అప్పలరాజు. అతడి దృష్టి అంతా రోడ్డుమీదే కేంద్రీకృతమై ఉంది. యాంత్రికంగా చేతులు స్టీరింగు మీదా, గేర్లు మీదా పని చేస్తున్నాయి

అప్పలరాజు తన గురించి ఎందుకింతగా తాపత్రయపడుతున్నాడో అర్థం కాలేదు రఘుకి. మనిషిలోని మంచితనం, ఉపకార బుద్ధి మొదటిసారిగా అప్పలరాజు లోనే చూస్తున్నాడు. అప్పలరాజు డ్రైవరుగా కాక తనని ఉద్ధరించడానికి వచ్చిన దేవుడిలా కనిపిస్తున్నాడు రఘు కళ్లకి అతడి మంచి తనాన్ని సహాయాన్ని ఎలా భరించాలో అర్థం కాలేదు రఘుకి.

బస్సు రామభద్రపురం సెంటరులో రెండే రెండు నిముషాలాపి వెంటనే లాగించే శాడు అప్పలరాజు అప్పటికి బస్సులో పదమూడుగురు పాసంజర్లు ఉన్నారు రామ భద్ర పురంలో రోజు సుమారు పది పది హేను నిముషాలు బస్సుని ఆపడం అలవాటు. బస్సు బయలుదేరిన నుండీ విపరీతంగా ఉంటున్న అప్పలరాజు ప్రవర్తనకి మిగతా వ్యాన్ మెదలకుండా ఉండడం తప్ప ఏమీ అనలేకపోయారు. మీరు నిముషంలో బస్సు వేగాన్నందుకుంది.

మామూలు టైముకి కనీసంఅరగంటన్నా ముందు వెళ్లాలి మామూళ్లు టైము కన్నా అరగంట ముందు వెళ్లడమంటే మాటలతో పని కాదు. ఆ విషయం అప్పల రాజుకీ తెలుసు. అయినా అతనిలో అధైర్యం చోటు చేసుకోలేదు. ఎలాగైనా ఎనిమిది గంటలా పదినిముషాలకి విజయనగరం చేరి పోవాలి. యాక్సిలేటర్ని బలంగా అదుక్కి తొక్కేశాడు బస్సు బాణంలా రోడ్డుమీద దూసుకు పోతూంది.

మధ్య మధ్యలో పాసంజర్లు చేతులెత్తి బస్సుని ఆపుతున్నారు. అప్పలరాజు వాళ్ళ నెవర్నీ చూడ్డంలేదు. బస్సు స్పీడు తగ్గించనూలేదు. ఆగని బస్సు వైపు నిస్స హాయంగా చూస్తూ నిలబడి పోతున్నారు మధ్య మధ్యలో పాసంజర్లు.

మధ్యలో చాలా టిక్కట్లు పోతున్నాయి. బస్సులో టిక్కట్లు లేవు. చెక్కరుకి కోపం వచ్చింది. మానాపురం దగ్గరవుతుండగా అప్పలరాజు దగ్గరకి వచ్చాడు.

"అసలు నీ ఉద్దేశం ఏటి? బండిలో చూస్తే టిక్కట్లు లేవు. దారిలో టిక్కట్లు వస్తుంటే ఆపవు!" అడిగాడు అప్పలరాజుని.

"ఈవేల మనం బేగి ఎలిపోవాల!"

"ఎందుకేటి?" కోపంగా అడిగాడు చెక్కరు.

"ఏమంది" ముక్తసరిగా అన్నాడు అప్పలరాజు.

"అయితే ఒట్టి బండి తీసికెలిపోతావన్న మాట!, నువ్వు యిలగసేస్తే ఓనరుగాలేటి? ఓనరుకి యివేల ఏటుంటాది? నోటికి మన్ను!"

"రోజుకి వందలు వందలు తింటున్న ఓనరు ఈ ఒక్కరోజుకి సచ్చిపోడులే!"

"అంతవరకు వచ్చిందన్నమాట నీ యవారం!, అదేటో రాత్రికి ఓనరు దగ్గరే తెలుస్తాను!"

మరి జవాబు చెప్పలేదు అప్పలరాజు. బండి తోలడంలో నిమగ్నమై పోయాడు. చేసేదిలేక తన సీట్లోకి వెళ్లి కూలబడ్డాడు చెక్కరు.

అప్పలరాజు తనకోసం చేస్తున్న ఈసాహ సానికి అతడికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు రఘు. తనమూలంగా అప్పల రాజు చిక్కుల్లో యిరుక్కుంటాడేమో!... వాళ్ల ఓనరుతో మాటపడవలసి వస్తుం దేమో!... బహుశా ఉద్యోగం పోతే... ఆ ఆలోచనరాగానే రఘుకి మనస్సు చివుక్కుమంది. తన మూలంగా అప్పలరాజు చిక్కుల్లో యిరుక్కోవడానికి రఘు మనస్సు అంగీకరించలేదు. అప్పరాజువైపు చూశాడు. అతడేమీ ఆలోచిస్తున్నట్టుగాని భయపడు తున్నట్టు గానీ కనిపించలేదు. పరిసరాలు పట్టించుకోకుండా బండి తోలడంలో



లీనమైపోయాడు. చూస్తుండగానే బస్సు మానాపురం రైలు గేటు దాటిపోయింది.

ఆవేళప్పుడు ఆ లైనులో రైళ్ళేవీ లేవు గానీ గూడ్సు బళ్ళు ఉంటాయి. ఆ టైము ప్పుడు ఒక గూడ్సు బండైనా వచ్చి గేటు మూసుకుందంటే యింత శ్రమా వృధా అయిపోతుంది. యింతవరకు ఆ అనుమానం అప్పలరాజుకు లేకపోలేదు యిక యిప్పుడు రైలు గేటు దాటి పోవడంతో తేలిగ్గా శ్వాస పీల్చాడు అప్పలరాజు.

మానాపురంలో రెండు టిక్కెట్లు దక్కించుకొని గజపతినగరు వచ్చేసరికి ఏడు గంటల నలభై నిముషాలయింది. అంటే అప్పటికి పావుగంట ముందు రాగలిగాడు అప్పలరాజు. గజపతినగరంనుండి విజయనగరానికి కనీసం గంట పడుతుంది యిప్పుడు ముప్పావుగంటలో విజయనగరం చేరాలి. మళ్ళీ యాక్సిలేటర్ని అదుక్కి తొక్కేశాడు అప్పలరాజు. బస్సు పరుగు అందుకొంది. విజయనగరం దగ్గరవుతున్నకొద్దీ రఘు గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. మాటి మాటికీ చేతి వాచీ చూడసాగాడు—

సరిగ్గా ఏనిమిదీ పదకొండు నిముషాలకి విజయనగరం అశోకాటాకీస్ జంక్షనుదగ్గర



ఆగింది బస్సు నిజానికి అది బస్సు రావలసిన రూటు కాదు ఆతోవన వస్తే రైలు స్టేషను దగ్గర అని అలా తీసుకొచ్చాడు అప్పలరాజు.

"యింకా బండి రాలేదు! బేగెల్లు" అంత సేపూ ఒక్క బీడీ కూడా కాల్చని అప్పలరాజు ఆత్రంగా బీడీ నోట్లో పెట్టుకుంటూ రఘుని చూసి అన్నాడు.

అప్పలరాజుకి తనకృతజ్ఞత ఎలా తెలియజేయాలో తెలియలేదు రఘుకి నిజంగా తన చర్మం ఒలిచి చెప్పులు కుట్టించి యిచ్చినా అప్పలరాజు ఋణం తీరదేమో నని పించింది. గబుక్కున పర్సుతీసి రెండు పది రూపాయల నోట్లు అప్పలరాజు చేతిలో పెట్టబోయాడు

"నాకెందుకు? నీకు ఉద్యోగం ఒస్తే అదే నాలు!, టయిమయిపోతంది బేగెలిపో!" తొందర పెట్టాడు.

మరో సారి అప్పలరాజు మంచి తనం ముందు తలవంచుకున్నాడు రఘు అక్కడి నాలుగు ఫర్లాంగుల దూరంలో ఉన్న స్టేషనుకి రిక్షా మీదచేరుకొని టిక్కట్టు తీసుకొని ఓవరు బ్రిడ్జి మీద నడుస్తుండగా ఓవరు బ్రిడ్జి క్రింద రోకలి బండలా తాపీగా వచ్చి ఆగింది హౌరా మద్రాసు జనత, 'టైము చూసుకున్నాడు రఘు. ఏనిమిది గంటల పద్దెనిమిది నిముషాలు అంది ఆక్షణంలో రఘుకి తను ఐ.ఎ.యస్. పాసై పోయానన్నంత ఆనందం కలిగింది.

ఆ తరువాత రఘు నిజంగానే ఐ ఎ యస్ పాసయ్యాడు ఈమాటలు కళ్యాణ్ నోటి వెంట ఎంతో తృప్తిగా అవందగా వచ్చాయి.

ఆ రఘు మరెవరో కాదు... వింటున్నావా... ఆ రఘుని నేనే...

ఆ అప్పలరాజు...

వింతకి భార్య పలకక పోవడంతో చెప్పడం ఆపి భార్య వైపు చూశాడు కళ్యాణ్. సుజాత చిరునవ్వు ముఖంతో నిద్ర పోతున్నది.

అప్పటి అప్పలరాజు రూపం యిప్పటికీ తన కళ్ళ ముందు మెదులుతూనే ఉంది. తను చనిపోయే వరకు అప్పలరాజు, అతడు చేసిన సహాయం గుర్తుంటాయి. అప్పలరాజు యిప్పుడు ఎలా వున్నాడో.. ఆలోచిస్తూ నిద్రలోకి జారిపోయాడు కళ్యాణ్

అప్పలరాజు యిప్పుడు ఉద్యోగం చేయడం లేదు. పెద్ద కొడుకుని ఇప్పుడు బి. ఏ. చదివించాడు ఎంత ప్రయత్నించినా ఎన్ని యింటర్వ్యూలకి వెళ్ళినా ఉద్యోగం దొరకడంలేదు. కరోజు ఉన్నట్టుండి అప్పలరాజు కొడుక్కి ఉద్యోగం దొరికింది అలాంటిలాంటి ఉద్యోగం కాదు ఆరువందల జీతం. పొంగిపోయాడు అప్పలరాజు

అన్నిటికీ తెగించి తను ఆనాడు ఒక అబ్బాయిని రైలుకి అందించానన్న సంగతి ఎప్పుడో మరచిపోయాడు. ఆ అబ్బాయి వల్లే యిప్పుడు తనకొడుక్కి ఉద్యోగం వచ్చిందని కూడా తెలియదు. ఆ అబ్బాయే తన భార్య తరపు నుండి వచ్చిన రికమండేషను కూడా కాదని, అప్పుడెప్పుడో తను చేసిన చిన్న సహాయాన్ని గుర్తుంచుకొని తన కొడుక్కి ఉద్యోగం యిచ్చినట్టు అసలు తెలియదు. తను చేసిన చిన్న ఉపకారానికి ఈ విధంగా కోటిరెట్లు ప్రతిఫలం తనకు తెలియకుండానే లభించి "కోటి గుణితం దివి దాయేత్" అన్న ఆర్యోక్తి తనపట్ల నిజమైందని ఏ మాత్రమూ తెలియదు అప్పలరాజుకి.

